సాక్షి
పార్వతీపురం మన్యం

శనివారం | 20 | ఏప్రిల్ | 2024



మరణ రేటు జీరో

గతంలో గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ, పారిశుద్ధ్య కార్యక్రమాలు అంతంతమాత్రంగానే ఉండేవి.

- 8లో



ఉపాధి భేష్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వేతనదారులకు కోట్లాది పనిదినాలు కల్పించింది.

- 8లో



ఉద్యోగుల మధ్య వివాదం

మండలంలోని మునకలవలస గ్రామ సచివాలయ ఉద్యోగుల మధ్య శుక్రవారం వివాదం నెలకొంది.

- 8లో

న్యూస్‌రీల్

నదీతీరంలో ఏనుగుల అలజడి

- పరుగు తీసిన గ్రామస్తులు



నదీతీరంలో ఏనుగులను చూసి పరుగు పెడుతున్న గ్రామస్తులు

భామిని: మండలంలోని తాలాడ వంశధార నదీ తీరంలో శుక్రవారం ఏనుగుల గుంపు అలజడి రేపింది. వేసవి తీవ్రతతో పెరిగిన ఉష్ణోగ్రతలకు విలవిలలాడిన ఏనుగుల గుంపు దాహార్తిని తీర్చుకోడానికి నదీ తీరానికి చేరుకున్న సమయంలో గ్రామస్తులు భయాందోళనతో పరుగులు తీశారు. వేసవి ఉపశమనానికి వంశధార నదిఒడ్డుకు తాలాడ వాసులు చేరుకుంటున్న సమయంలోనే ఏనుగుల గుంపు తారసపడడంతో గందరగోళం నెలకొంది. స్నానాలకు వెళ్లిన గ్రామస్తులు పరుగుపెట్టారు. అంతా సద్దుమణిగాక ఏనుగులు జలకాలాడి నీరు తాగి వెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



ద్విచక్రవాహనంలో బ్యాగ్‌లను తనిఖీ చేస్తున్న ఎఫ్‌ఎస్‌టీ అధికారి చిన్నారావు

సీతానగరం: సాధారణ ఎన్నికలకు నామినేషన్లు దాఖలవుతున్న కారణంగా రాష్ట్ర రహదారిపై వాహనాల తనిఖీ ముమ్మరం చేశామని ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్(ఎఫ్‌ఎస్‌టి) అధికారి కె.చిన్నారావు అన్నారు. ఈ మేరకు రాష్ట్ర రహదారిలో బొబ్బిలి-సీతానగరం సరిహద్దు లచ్చయ్యపేట జంక్షన్ నుంచి సూరంపేట వరకు వాహనాలను తనిఖీ చేశారు. కింతలివానిపేట జంక్షన్ వద్ద ద్విచక్రవాహనంపై తరలిస్తున్న బ్యాగ్‌లను తనిఖీ చేస్తున్న సమయంలో ఆయన మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కావడంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు పోలీస్ సిబ్బంది సహకారంతో వాహనాలు తనిఖీ చేస్తున్నామన్నారు. పోటీల్లో ఉన్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు తాయిలాలు సమర్పించడానికి వాహనాల్లో నిబంధనలకు మించి నగదు, ఆకర్షణీయమైన వస్తువులు తరలించే అవకాశాలున్నాయని భావించి వాహనాల తనిఖీకి రిటర్నింగ్ అధికారి మార్గదర్శకాలు విడుదల చేశారని తెలియజేశారు. ఈ నేపథ్యంలో మే నెల 13 ఎన్నికల పోలింగ్ జరిగేంత వరకూ నిరంతరం వాహనాల తనిఖీ చేపట్టనున్నామన్నారు. తనిఖీ అధికారులకు వాహనాలు ఎక్కడైనా ఆపి తనిఖీచేసే అధికారం ఉందని, పోలీసు వారి సహకారంతోనే చేపట్టే తనిఖీ సమయంలో వాహన యజమానులు సహకరించాలని కోరారు.

రామతీర్థంలో వైభవంగా సహస్ర దీపాలంకరణ



రామతీర్థంలో సహస్ర దీపాలను వెలిగిస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన పూజలు నిర్వహించిన తరువాత యాగశాలలో నిత్య హోమాలు, వెండి మండపం వద్ద స్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. సాయంత్రం 6 గంటలకు సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా దీపారాధన మండపంపైకి తీసుకువచ్చి ప్రత్యేక ఊయలలో ఆసీనులు చేశారు. అనంతరం దీపాలు వెలిగించి ఊంజల్ సేవ జరిపించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బొబ్బిలి చీరల పరిశీలన

బలిజిపేట: నారాయణపురం గ్రామానికి చెందిన నీలకంఠేశ్వర చేనేత సహకార సంఘం తయారు చేస్తున్న బొబ్బిలి చీరలను రాష్ట్ర ఆప్కో మేనేజింగ్ డైరెక్టర్ పవనమూర్తి శుక్రవారం పరిశీలించారు. ఇటీవల కాలంలో సహకార సంఘం తయారు చేసిన బొబ్బిలి చీరలను రాష్ట్రంలోని అన్ని ఆప్కో షోరూంలకు సరఫరా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వాటి నాణ్యతను పరిశీలించేందుకు ఆప్కో ఎండీ పవనమూర్తి అమరావతి నుంచి ఇక్కడకు వచ్చారు. చీరలను పరిశీలించి వాటి నాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు అవసరమైన సూచనలు, సలహాలు సంఘ సభ్యులకు అందించారు. ఆయన వెంట కె.వీర్రాజు, సీహెచ్.నారాయణరావు, సభ్యులు ఉన్నారు.

జయం మనదే

- వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల్లో స్పష్టంగా గెలుపు ధీమా
- పాలకొండ, కురుపాంలో సమరోత్సాహంతో నామినేషన్ల దాఖలు
- సాలూరులో నిరాడంబరంగా రాజన్నదొర..
- వెల్లువలా తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలు, నాయకులు



ఎర్రటి ఎండను లెక్కచేయని అభిమానం ..తమ ప్రతినిధిపై ఉన్న అంతులేని ప్రేమ..విజయంపై సడలని ఆత్మవిశ్వాసం ..ఎవరు పోటీలో ఉన్నా గెలుపు ఫిక్స్ అన్న నమ్మకం..పోలింగ్ లాంఛనమే అన్న ధీమా..వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు, వారి అనుచరులు, పార్టీ కార్యకర్తలు, నాయకుల్లో స్పష్టంగా కనిపిస్తోంది. పార్వతీపురం మన్యం జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలు, అరకు పార్లమెంట్ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు శుక్రవారం నామినేషన్లు దాఖలు చేసిన సందర్భంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు కదం తొక్కాయి. సమరోత్సాహంతో తమ అభ్యర్థుల వెంట అడుగేస్తూ వారిని ముందుకు నడిపిస్తూ..విజయం పట్ల వారికి నమ్మకం కలిగిస్తూ కదిలాయి. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు..నాయకులు ఎన్నికల కదనరంగంలోకి కాలుపెట్టిన సందర్భంగా ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయా? అన్న రీతిలో నామినేషన్ల ఘట్టం కోలాహలంగా సాగింది.

–సాక్షి, పార్వతీపురం మన్యం



విశ్వాస రాయి కళావతి నామినేషన్ సందర్భంగా తరలివచ్చిన ఆమె అనుచరులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు (ఇన్‌సెట్లో) నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పిస్తున్న పాలకొండ అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని విశ్వాసరాయి కళావతి

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా గురువారం ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో తొలిరోజు ఒక నామినేషన్ పడగా.. రెండో రోజు శుక్రవారం ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి 6 నామినేషన్లు దాఖలయ్యాయి. ఏకాదశి శుభతిథి కావడంతో నామినేషన్ వేసేందుకు ప్రాధాన్యమిచ్చారు. ఈ మేరకు ఆలయాల్లో పూజలు నిర్వహించి, పెద్దల ఆశీర్వాదం తీసుకుని బయల్దేరారు. ఉపముఖ్యమంత్రి, సాలూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పీడిక రాజన్నదొర నిరాడంబరంగా వెళ్లి రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో విష్ణుచరణ్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ నెల 24న మరోసారి కార్యకర్తలు, అభిమానులు, నాయకుల సమక్షంలో అట్టహాసంగా ఆయన నామినేషన్ వేయనున్నట్లు తెలుస్తోంది. ఇక్కడి టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి తరఫున గుమ్మడి సంధ్యారాణి నామినేషన్ దాఖలు చేశారు. కురుపాం అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి నియోజకవర్గవ్యాప్తంగా పెద్ద ఎత్తున తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వెళ్లి కురుపాం తహసీల్దార్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి వీవీ రమణకు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఆమె భర్త, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, అరకు పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థిని డాక్టర్ గుమ్మ తనూజరాణి ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఉన్నారు. పాలకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని విశ్వాసరాయి కళావతి తొలుత పలు ఆలయాల్లో పూజలు చేసిన అనంతరం సీతంపేట సంత నుంచి ఐటీడీఏ వరకు అభిమానులతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీగా వెళ్లారు. నియోజకవర్గం నలుమూలల నుంచి తరలివచ్చిన అభిమానులు ఆమె వెంట నడిచారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి ఆమె నామినేషన్ పత్రాలు అందజేశారు. పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున బోనెల విజయచంద్ర, స్వతంత్ర అభ్యర్థిగా గర్భాపు ఉదయభాను నామినేషన్ దాఖలు చేశారు.

పార్లమెంట్ స్థానానికి నాలుగు నామినేషన్లు

అరకు పార్లమెంట్ స్థానానికి సంబంధించి రెండోరోజు నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ గుమ్మ తనూజరాణి తరఫున కుటుంబసభ్యులు ఒక సెట్ నామినేషన్‌ను కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి నిషాంత్‌కుమార్‌కు అందజేశారు. సీపీఐ, కాంగ్రెస్ మద్దతుతో ఇండియా వేదిక బలపర్చిన సీపీఎం అభ్యర్థి పి.అప్పలనర్స.. బీజేపీ నుంచి బహిష్కరణకు గురైన నిమ్మక జయరాజుతో పాటు, పాలక రంజిత్‌కుమార్ స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు.



వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి గుమ్మ తనూజరాణి తరఫున రిటర్నింగ్ అధికారి నిషాంత్‌కుమార్‌కు నామినేషన్ దాఖలు చేస్తున్న దృశ్యం



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కురుపాం అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని పాముల పుష్పశ్రీవాణి



నామినేషన్ దాఖలు చేసేందుకు వెళ్తున్న పీడిక రాజన్నదొర నుదుటన కుంకుమ పెడుతున్న మహిళ



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ సమర్పిస్తున్న సాలూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పీడిక రాజన్నదొర



పుష్పశ్రీవాణి నామినేషన్ కార్యక్రమానికి ఆమె వెంట తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు

ఆమె రెండుసార్లు ఎమ్మెల్యే..
ఆస్తుల విలువ రూ.69 లక్షలే...

- పాలకొండ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి నిరాడంబర జీవితం

పాలకొండ రూరల్: పాలకొండ అసెంబ్లీ స్థానానికి మూడో దఫా వైఎస్సార్‌సీపీ నుంచి బరిలో నిలిచిన ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి వ్యక్తిగత ఆస్తుల విలువ కేవలం రూ.69 లక్షలు మాత్రమే. (ఆమె వాడుతున్న రెండు కార్లు, మూడు ఎకరాల పొలం, బ్యాంక్ డిపాజిట్లు, వండవలో తన స్వగృహం విలువ ఇది). ఈ రోజుల్లో అతి సామాన్యుడు కూడా ఆస్తులు కూడబెట్టుకుంటున్న తరుణంలో వరుసగా రెండు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసినా.. ఆస్తులు పెంచుకోవడం కంటే ప్రజాసేవే పరమావధిగా సాగారు. తన నామినేషన్ పత్రంలో అధికారులకు నిష్పక్షపాతంగా తన వ్యక్తిగత ఆస్తుల వివరాలను సమర్పించి, సర్వసాధారణ మధ్యతరగతి గృహిణిగా, అసలు సిసలైన గిరిజన మహిళగా నిరూపించుకున్నారు. మరోవైపు తన భర్త, కుమార్తె పేరిట ఉన్న ఆస్తుల వివరాలను సైతం తెలియపర్చారు. భర్త మండంగి హరిప్రసాద్ పేరిట విశాఖలో ఓ ఫ్లాట్ (రూ.35లక్షలు), 4.74 ఎకరాల పొలం (రూ.60లక్షలు) విలువ గలది ఉన్నాయని, కుమార్తె సాయివైష్ణవి పేరిట రూ.2లక్షల40వేల విలువగల బంగారు ఆభరణాలు ఉన్నట్లు స్పష్టం చేశారు. వీటితోపాటుగా ఆమె పేరిట రూ.5.91 లక్షలు, భర్త పేరిట రూ.1.30 లక్షలు బ్యాంకు రుణాలు ఉన్నట్టు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

పక్కాగా వ్యయ రిజిస్టర్ నిర్వహణ

- అరకు పార్లమెంట్ వ్యయ పరిశీలకుడు గురుకరణ్‌సింగ్



సహాయ వ్యయ పరిశీలకులతో సమావేశంలో మాట్లాడుతున్న అరకు పార్లమెంట్ నియోజకవర్గం వ్యయపరిశీలకుడు గురుకరణ్‌సింగ్

పార్వతీపురం: షాడో వ్యయ రిజిస్టర్‌ను పక్కాగా నిర్వహించాలని అరకు పార్లమెంట్ నియోజకవర్గం వ్యయ పరిశీలకుడు గురు కరణ్‌సింగ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో వ్యయ నమోదుపై సహాయ వ్యయ పరిశీలకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల పోటీల్లో ఉన్న అభ్యర్థులు ప్రచారంలో భాగంగా నిర్వహించే ర్యాలీలు, సమావేశాలు, ఇతర కార్యక్రమాలపై దృష్టి సారించాలని చెప్పారు. కాఫీ, టీ, తాగునీటి వంటి అంశాలతో సహా వాహనాల వినియోగం తదితరాలను పరిశీలించాలని స్పష్టం చేశారు. ఎక్కడా ఎలాంటి అశ్రద్ధ చేయరాదని ఆదేశించారు. అనుమతులు పొందిన వాహనాల వివరాలు నోడల్ అధికారి వద్ద ఉండాలని వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, అరకు పార్లమెంట్ నియోజకవర్గం సహాయ రిటర్నింగ్ అధికారి ఎస్‌ఎస్ శోభిక, వ్యయవిభాగం నోడల్ అధికారి, జిల్లా సహకార అధికారి పి.శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ సందర్శన

జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల కమాండ్ కంట్రోల్ రూమ్‌ను అరకు పార్లమెంట్ నియోజకవర్గం వ్యయ పరిశీలకులు గురుకరణ్‌సింగ్ శుక్రవారం సందర్శించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి విభాగం, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్, సోషల్ మీడియా విభాగం, వ్యయ విభాగం, ఫిర్యాదుల విభాగం, చెక్‌పోస్టుల పర్యవేక్షణ, నియంత్రణ తదితర విభాగాలను పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ రూమ్ పనితీరును ఆయనకు జాయింట్ కలెక్టర్ వివరించారు. అనంతరం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్, అరకు పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి నిషాంత్‌కుమార్‌ను వ్యయ పరిశీలకుడు గురుకరణ్ సింగ్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ జి.కేశవ నాయుడు, ఎస్‌సీసీ నోడల్ అధికారి ఎం.డి గయాజుద్దీన్, సోషల్ మీడియా నోడల్ అధికారి సాయికుమార్, ఎంసీఎంసీ నోడల్ అధికారి ఎల్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నుంచే ఓటు



చాపరాయి బిన్నిడిలో దివ్యాంగుడికి ఫారం -12ను అందజేస్తున్న సెక్టోరియల్ ఆఫీసర్ సీహెచ్ ప్రసాద్, బీఎల్వో

గుమ్మలక్ష్మీపురం:

ఓటు హక్కును వినియోగించుకోవాలనే ఆశక్తి ఉన్నా వయోభారంతో ఇల్లు కదల్లేని వారికి, దివ్యాంగులకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక అవకాశాన్ని కల్పించింది. ఓట్ ఫ్రం హోం పద్ధతిలో వీరు తమ ఓటు హక్కును ఇంటి నుంచే వేసే వెసులుబాటు ఇచ్చింది. ఈ నేపథ్యంలో బూత్ లెవెల్ ఆఫీసర్లు, సెక్టోరియల్ ఆఫీసర్లు గ్రామాల్లోని హోం ఓటింగ్‌కు అర్హులైన ఓటర్ల వద్దకు వెళ్లి హోం ఓటింగ్ ఆప్షన్ తీసుకుంటారా.. లేదంటే పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేస్తారా.. అన్న విషయాలను సేకరిస్తున్నారు. అలాగే హోం ఓటింగ్ ఆప్షన్ తీసుకునే వారు సమ్మతి పత్రాలు (ఫారం-12)ఇవ్వాల్సిందిగా కోరుతున్నారు. సమ్మతి తెలుపుతూ సమ్మతి పత్రాలు అందజేసిన వారు ఎన్నికల కమిషన్ సూచించే తేదీల్లో ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంటుంది. వీరి వద్దకు సెక్టోరల్ అధికారులు, బీఎల్‌ఓలు, పోలింగ్ ఏజెంట్లు, సూపర్‌వైజర్లు వెళ్తారు. శరీరం సహకరించలేని వారికి సహాయకులను నియమిస్తారు. ఈ సహాయకులకు కుడి వేలిపై సిరా గుర్తు వేస్తారు. మళ్లీ ఆ సహాయకుడు ఓటు వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుంది. శత శాతం పోలింగ్ నమోదు చేసేందుకు ఎన్నికల కమిషన్ తీసుకున్న ఇంటి నుంచే ఓటు కార్యక్రమంను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పి.రామారావు తెలిపారు. అర్హులైన వారు సద్వినియోగించుకోవాలని కోరారు.

ప్రవేశ పరీక్ష రేపు

పార్వతీపురం: గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల్లో ఐదోతరగతి ప్రవేశానికి, 6,7,8,9 తరగతులకు బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 21న ప్రవేశపరీక్షను నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఏపీటీడబ్ల్యూఆర్‌ఎస్(బాలురు) పి.కోనవలస, ఏపీటీడబ్ల్యూఆర్‌ఎస్ (బాలికలు)కురుపాం, ఏపీ టీడబ్ల్యూఆర్‌ఎస్(బాలురు) భద్రగిరి, ఏపీటీడబ్ల్యూఆర్‌ఎస్ (బాలురు)కొమరాడ కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రజాభిమానం నా అదృష్టం



మాట్లాడుతున్న సాలూరు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొర

- ప్రజలతో మమేకం కావడమే రాజకీయం
- సాలూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొర

సాలూరు: ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డితో పాటు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజల అభిమానాన్ని చూరగొనడం తన అదృష్టమని సాలూరు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సాలూరు ఆర్‌ఓ కార్యాలయంలో తన తొలిసెట్ నామినేషన్ దాఖలు చేసిన తరువాత విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గడపగడపకు వైఎస్సార్‌సీపీ, అధికారంలోకి వచ్చిన తరువాత గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాల ద్వారా నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు అండగా నిలిచామని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ, పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందించారని తెలిపారు. తన పాలనలో మీకు మంచి జరిగితేనే ఓటు వేయండని ధైర్యంగా ప్రజలను కోరుతున్న దేశంలోనే ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని స్పష్టం చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు అధికారంలోకి ఉండగా రైతులు, మహిళలు, యువత తదితర అన్ని వర్గాల ప్రజలను మోశాం చేశారని విమర్శించారు. నేడు సూపర్‌సిక్స్ అంటూ మళ్లీ ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలకు మంచి చేసింది జగన్‌మోహన్‌రెడ్డి అని, ప్రజలను మోసం చేసింది చంద్రబాబు అని స్పష్టం చేశారు.

మోసగాళ్ల మాటలు నమ్మవద్దు

పొత్తులతో వస్తున్న ఈ మోసగాళ్ల మాటలను నమ్మవద్దని ప్రజలను కోరారు. నియోజకవర్గంలో ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ వస్తున్నానన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సాలూరు నియోజకవర్గంలో వేల కోట్ల రూపాయల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేశామని పేర్కొన్నారు. ప్రజలకు మంచి చేసిన జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపైవేసి వైఎస్సార్‌సీపీ విజయ దుందుభి కొనసాగించడానికి ప్రజలంతా సంసిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఆయన వెంట అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకుడు శ్రీనివాసరావు పార్టీ నాయకులు ఉన్నారు.

క్లుప్తంగా

మీడియా కేంద్రాన్ని పరిశీలించిన వ్యయ పరిశీలక బృందం

విజయనగరం అర్బన్: ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా కేంద్రాన్ని వ్యయ పరిశీలకులు ప్రభాకర్ ప్రకాష్ రాజన్, ఆనంద్ కుమార్, ఆకాష్ దీప్ శుక్రవారం కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు. మీడియా మానిటరింగ్, మోడల్ కోడ్ కమిటీ, సోషల్ మీడియా, జిల్లా వ్యయ అంచనాల కమిటీ, ఫిర్యాదులు, రిపోర్టింగ్ విభాగాలను పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వారి విధుల గురించి అడిగి, రిజిస్టర్లను పరిశీలించారు. వాహనాల జీపీఎస్ సిస్టంను, మద్యం చెక్ పోస్టుల కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను తనిఖీ చేశారు. అనంతరం మీడియా కేంద్రాన్ని సందర్శించారు.

యువకుడి ఆత్మహత్య


మృతుడు విజయ్‌కుమార్

బాడంగి: మూడేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్న ఓ యువకుడు జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని ఆనవరం గ్రామానికి చెందిన తూముల విజయ్‌కుమార్(23) గురువారం పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మూడేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతూ పార్వతీపురం ఆస్పత్రిలో చికిత్స పొందినా నయం కాకపోవడంతో నొప్పి తట్టుకోలేక విసిగిపోయి జీవితంపై విరక్తితో గ్రామానికి సమీపంలో గల అరటి తోట వద్ద పురుగు మందు సేవించాడు. విషయం తెలుసుకున్న మృతుడి సోదరుడు, స్నేహితుడు 108లో బొబ్బిలి ఆస్పత్రిలో చేర్పించి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం విజయనగరం రిఫర్ చేయగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. తండ్రి తూముల కృష్ణ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఆర్.జయంతి పర్యవేక్షణలో హెచ్‌సీ ఉమామహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

బీరు బాటిళ్ల పట్టివేత


పట్టుబడిన మద్యం సీసాలతో ఎస్‌ఐ, పట్టుబడిన వ్యక్తి

వేపాడ: మండల కేంద్రమైన వేపాడ జంక్షన్ వద్ద వల్లంపూడి పోలీసులు నిర్వహించిన దాడుల్లో 12 బీరు సీసాలు పట్టుబడినట్లు వల్లంపూడి ఎస్.ఐ రాజేష్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన దాడుల్లో జంక్షన్‌లో తనిఖీ నిర్వహిస్తుండగా 12 బీరు సీసాలు పట్టుబడటంతో సీసాలతో పాటు వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం సీసాలు రవాణా చేసినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు.

మరణ రేటు జీరో




పార్వతీపురం గిరిజన సంక్షేమవసతి గృహంలో దోమల మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

ఐదేళ్లలో జిల్లాలో మలేరియా కేసుల వివరాలు			
సంవత్సరం	రక్త పరీక్షలు	మలేరియా నిర్ధారణ	మరణాలు కేసులు
2019	280725	150	0
2020	186275	124	0
2021	259207	109	0
2022	263417	502	0
2023	264449	482	0
2024 (మార్చి వరకు)	72902	130	0

- ఫలించిన రాష్ట్రప్రభుత్వం చర్యలు
- విస్తృతంగా వైద్యారోగ్య కార్యక్రమాలు
- ఏటా రెండు విడతల్లో దోమల నివారణ మందు పిచికారీ
- పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి
- 410 మలేరియా పీడిత గ్రామాల గుర్తింపు క్రమం తప్పకుండా దోమతెరల పంపిణీ

పార్వతీపురంటౌన్: గతంలో గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ, పారిశుద్ధ్య కార్యక్రమాలు అంతంతమాత్రంగానే ఉండేవి. గిరిజనుల ప్రాణాలంటే గతంలో పాలకులకు లెక్క ఉండేది కాదు. 2012 నుంచి 2018 వరకు జిల్లాలో మలేరియా తీవ్రత అధికంగా ఉంది. మరణాలు కూడా ఎక్కువగా నమోదయ్యేవి. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన తర్వాత గిరిజన ప్రాంతాల్లో జీవించే ప్రతి ఒక్కరికి ఆరోగ్య భరోసా కలిగింది. సీజనల్ వ్యాధుల నివారణే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి వైద్యారోగ్య కార్యక్రమాలను విస్తృతం చేశారు. గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి 50 కుటుంబాలకు గ్రామ వలంటీర్ సేవలు అందుబాటులోకి తెచ్చారు. సీజనల్ వ్యాధుల నివారణకు ప్రభుత్వ యంత్రాగం పలు చర్యలు చేపట్టింది. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను విస్తృతం చేసింది. మరోవైపు దోమల నివారణకు మలేరియా, వైద్యారోరోగ్యశాఖ బృందాలు నిరంతరం పనిచేశాయి.

జిల్లావ్యాప్తంగా 4,42,400 దోమతెరలు

2022లో జిల్లావ్యాప్తంగా 4,42,400 దోమతెరలను ప్రభుత్వం పంపిణీ చేసింది. దోమతెరల వినియోగంపై వైద్యబృందాలు, సచివాలయ ఉద్యోగులు గిరిజనులకు అవగాహన కల్పించారు. ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు వ్యాధుల సీజన్‌గా ప్రభుత్వం గుర్తించి వైద్యారోగ్య కార్యక్రమాలను చేపడుతోంది. 2019 నుంచి నుంచి దోమల నివారణతో పాటు మలేరియా తీవ్రతను అరికట్టడంలో మలేరియా, వైద్యారోరోగ్యశాఖలు ఎంతో శ్రమించాయి. ప్రతి ఏడాది రెండు దఫాలుగా దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్నాయి. ప్రతి గ్రామంలో ఇంటి లోపల, బయట దోమల మందు పిచికారీని తప్పనిసరిగా చేయించాలనే నిబంధనను సచివాలయ ఉద్యోగులు అమలు చేశారు. గ్రామ వలంటీర్లు తమకు నిర్దేశించిన గిరిజన కుటుంబాల నివాసాల వద్ద దగ్గరుండి దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ఇంటింటా ఫీవర్ సర్వే విజయవంతంగా నిర్వహించారు. చిన్నపాటి జ్వరం వచ్చినా వైద్యసిబ్బంది వెంటనే రక్త పరీక్షలు చేసేవారు. మలేరియా, ఇతర జ్వరాలను నిర్ధారించి సకాలంలో వైద్యసేవలు అందించడంతో జ్వరపీడితులు కోలుకున్నా రు. ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఫలించడంతో మలేరియా వ్యాధి బారిన పడి ఎవరూ మృతి చెందలేదు.

'మే 15 నుంచి దోమల నివారణ మందు పిచికారీ

ఈఏడాది కూడా దోమల నిర్మూలన కార్యక్రమాలకు మలేరియా, వైద్య ఆరోగ్యశాఖలు చర్యలు చేపట్టాయి. ఎన్నికల కోడ్ రాకముందే రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతాల్లో మలేరియా నివారణకు చేపట్టాల్సిన చర్యలను నిర్దేశించింది. ఈ మేరకు జిల్లాలో 401 మలేరియా పీడిత గ్రామాలను గుర్తించి మే 15 నుంచి మొదట విడత దోమల నివారణ మందు పిచికారీని జిల్లా మలేరియాశాఖ ప్రారంభించనుం ది.

401 మలేరియా పీడిత గ్రామాలను గుర్తించాం



జిల్లా వ్యాప్తంగా 401 మలేరియా పీడిత గ్రామాలను గుర్తించాం. గ్రామాల్లో మలేరియా కేసులు నమోదైనా అక్కడ కూడా వైద్య బృందాలను అప్రమత్తం చేస్తున్నాం. దోమల నివారణ చర్యలతో పాటు సంపూర్ణ పారిశుద్ధ్యానికి డ్రైడే నిర్వహిస్తున్నాం. మలేరియా కేసులు నమోదవుతునప్పటికీ సకాలంలో వైద్యసేవలు అందించడంతో ఈ ఐదేళ్లలో ఆ వ్యాధితో మరణాలు నమోదు కాలేదు.

– డాక్టర్ టి. జగన్మోహన్ రావు, డీఎంఒ, పార్వతీపురం మన్యం


దోకిశీలలో డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్న సిబ్బంది


స్కూల్‌హెల్త్ కార్యక్రమంలో రక్తపరీక్షలు చేస్తున్న సిబ్బంది

మునకలవలస సచివాలయంలో ఉద్యోగుల మధ్య వివాదం


మునకలవలస సచివాలయంలో ధ్వంసమైన కుర్చీలు

రేగిడి : మండలంలోని మునకలవలస గ్రామ సచివాలయ ఉద్యోగుల మధ్య శుక్రవారం వివాదం నెలకొంది. సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ కె.సత్యనారాయణ తనకు జీతం బిల్లును పంచాయతీ కార్యదర్శి పి.సుధీర్‌కుమార్ పెట్టకపోవడంపై వీరిద్దరి మధ్య వివాదం తలెత్తినట్లు గ్రామస్తులు వెల్లడించారు. సచివాలయంలో వీరిద్దరు పరస్పరం వాదోపవాదనలు చేసుకుని, చివరికి సచివాలయంలో ఫర్నిచర్‌ను ధ్వంసం చేసినట్లు తెలిపారు. గతంలో వీరిద్దరి మధ్య వ్యక్తిగత విభేదాలు కూడా ఉన్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై సమాచారం తెలుసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించి, పంచాయతీ కార్యదర్శితో పాటు డిజిటల్ అసిస్టెంట్ వద్ద స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. గ్రామస్తులతో పాటు మండల పరిషత్ అధికారులు వద్ద ఈ వివాదానికి సంబంధించి వివరాలు ఆరా తీస్తున్నారు.

144 మద్యం బాటిళ్ల స్వాధీనం

విజయనగరం క్రైమ్: విజయనగరం మండల పరిధి బియ్యాలపేట గ్రామ శివార్లలో అక్రమంగా తరలిస్తున్న 144 మద్యం బాటిళ్లను, ఒక బైక్‌ను రూరల్ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ వాసుదేవ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

విజయనగరం క్రైమ్: వన్‌టౌన్ పరిధిలో పద్మావతీనగర్ గాయత్రీ లేఅవుట్‌లో పేకాట ఆడుతున్న 11 మందిని టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ సాగర్‌బాబు, వన్‌టౌన్ ఎస్‌ఐ హరిబాబునాయుడుల ఆధ్వర్యంలో శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 11 మొబైల్స్, రూ.50వేల 800లు స్వాధీనం చేసుకున్నారు.

పిచ్చి కుక్క స్వైర విహారం

- తొమ్మిది మందికి తీవ్ర గాయాలు

బొండపల్లి: మండల కేంద్రమైన బొండపల్లి గ్రామంలో పిచ్చి కుక్క స్వైర విహారం చేసి తొమ్మిది మందిని కరిచి తీవ్రంగా గాయపరిచింది. గ్రామంలోని యాత వీధిలో ఆరు బయట ఉన్న వారిపై కుక్క విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరిచింది. స్థానికులు వెంటబెట్టగా అక్కడ నుంచి జాతీయ రహదారికి ఆనుకోని ఉన్న టీ పాయింట్‌కు సమీపంలో మరి కొంత మందిపై దాడి చేసింది. అక్కడ నుంచి జాతీయ రహదారి పక్కన తాటి ముంజెలు విక్రయిస్తున్న వారితో పాటు, రోడ్డు పక్కన లారీని ఆపి ఉంచిన డ్రైవర్‌పై కూడా దాడి చేసింది. ఈ ఘటనల్లో గ్రామానికి చెందిన పి.అచ్చియ్యమ్మ, బి.కృష్ణమ్మ, బి.సంతోష్ , కె.సురేష్, పి.రామలక్ష్మి, వై.సన్యాసిలకు తీవ్ర గాయాలు కాగా, బొండపల్లిలోని పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. బొండపల్లి పీహెచ్‌సీలో నీలాతి రాము, పురం రామలక్ష్మి, ఎర్ర సన్యాసిలు చికిత్స పొందుతున్నారు.

జనం.. నీరాజనం


చీపురుపల్లి: ఎన్నికల ప్రచారంలో భాగంగా పిల్లపేటలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ


విజయనగరం: నగరంలోని 15వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల తదితరులు

సార్వత్రిక ఎన్నికలకు ప్రకటన వెలువడడంతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ప్రచారానికి వెళ్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. జగనన్న పాలనలో పొందిన మేలును గుర్తించి అభ్యర్థుల వెనుక ప్రజలు స్వచ్ఛందంగా ప్రచారంలో పాల్గొంటున్నారు. మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిని చేస్తామంటూ నినదిస్తున్నారు. దీంతో అభ్యర్థులు మరింత ఉత్సాహంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్


గజపతినగరం రూరల్ : రామన్నపేటలో ఎమ్మెల్యే అభ్యర్థి బొత్స అప్పలనరసయ్యకు హారతులు పడుతున్న మహిళలు


భోగాపురం: మండలం సుందరపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కందుల రఘుబాబు తదితరులు

ఆటో ఢీకొని యువకుడికి గాయాలు

బొబ్బిలి: మండలంలోని రంగరాయపురానికి చెందిన రాజాన దిలీప్ ఫ్లిప్‌కార్ట్ ఆన్‌లైన్ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. అదే పనిపై పట్టణంలోని శ్రీకళాభారతి వెనుక గల రాతిపనివారి వీధి వెళ్లి డెలివరీ అనంతరం తిరిగి వస్తుండగా మెయిన్ రోడ్డు మీదుగా తెర్లాం మండలం కూనాయవలసకు చెందిన మోది సింహాచలం నడుపుతున్న ఆటో ఢీకొనడంతో దిలీప్ గాయపడ్డాడు. వెంటనే దిలీప్‌ను స్థానిక సీహెచ్‌సీకి తరలించగా మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించినట్టు ఏఎస్సీ జి.భాస్కరరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికెన్	బ్రాయిలర్	
లైవ్ ₹130	డ్రెస్డ్ ₹230	స్కిన్‌లెస్ ₹240

ఉపాధి భేష్

- ఐదేళ్లలో 12.32 కోట్ల పనిదినాలు
- వేతనాల కోసం వెచ్చించిన నిధులు రూ.2732.13 కోట్లు
- మెటీరియల్ నిమిత్తం ఖర్చు చేసింది రూ.816.48 కోట్లు
- ఒక్కో కుటుంబానికి రూ.25 వేల నుంచి రూ.27 వేల వరకు లబ్ధి
- జిల్లాలో జాబ్ కార్డులు 3.45లక్షలు
- వేతనదారులు 6.06 లక్షలు

విజయనగరం ఫోర్ట్:

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వేతనదారులకు కోట్లాది పనిదినాలు కల్పించింది. ఫలితంగా జిల్లాలో వలసలు గణనీయంగా తగ్గాయి. ఐదేళ్ల కాలంలో ప్రతి గ్రామంలోను పెద్ద ఎత్తున పనులు కల్పించారు. గతంలో ఉపాధి లేక గ్రామాల్లో కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లేవారు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం సొంతూళ్లలో పని కల్పించింది. దీంతో అధిక సంఖ్యలో వేతనదారులు పనులకు వెళ్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వేతనాల చెల్లింపు కూడా సత్వరమే చెల్లిస్తున్నారు. దేశంలోనే విజయనగరం జిల్లా పని కల్పనలో ప్రథమంగా నిలిచింది. ప్రతి కుటుంబానికి 100 రోజులు పాటు ఈ పథకం ద్వారా పని కల్పిస్తారు. ఉన్న ఊళ్లలోనే పని దొరుకుతుంది. సాఫీగా జీవనం సాగిస్తున్నారు.


గంట్యాడ మండలం పెదవేమలి గ్రామంలో పని చేస్తున్న వేతనదారులు

2019 నుంచి 2024 మార్చి నెలాఖరు నాటికి కల్పించిన పని దినాలు	
సంవత్సరం	పని దినాలు
2019–20	2.58 కోట్లు
2020–21	3.06 కోట్లు
2021–22	2.55 కోట్లు
2022–23	1.95 కోట్లు
2023–24	2.18 కోట్లు

సంవత్సరం	వేతనదారులకు చెల్లించింది
2019–20	రూ.563.18 కోట్లు
2020–21	రూ.731.85 కోట్లు
2021–22	రూ.527.78 కోట్లు
2022–23	రూ.406.55 కోట్లు
2023–24	రూ.502.77 కోట్లు

సంవత్సరం	మెటిరియల్ పనులకు వెచ్చించిన నిధులు
2019–20	రూ.62.12 కోట్లు
2020–21	రూ.312.70 కోట్లు
2021–22	రూ.198.00 కోట్లు
2022–23	రూ.114. 61 కోట్లు
2023–24	రూ.129.05 కోట్లు

జిల్లాలో జాబ్ కార్డులు 3.45 లక్షలు

జిల్లాలో జాబ్ కార్డులు 3.45లక్షలు ఉన్నాయి. వీటిలో 3.21లక్షల జాబ్ కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయి. వీటి పరిధిలో 6.06 లక్షల మంది వేతనదారులు ఉన్నారు. వీరిలో 5.04 లక్షల మంది వేతనదారులు పనులకు వెళ్తున్నారు.

ఒక్కో వేతనదారుడికి రూ.25 వేల వరకు లబ్ధి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనికి వెళ్లే వేతనదారుడికి వేలాది రుపాయిలు ఏటా అందుతున్నాయి. ఏడాదికి ఒక్కో కుటుంబానికి రూ.25 వేల నుంచి రూ. 30 వేల వరకు లబ్ధి చేకూరుతుంది. ప్రతి ఏటా ప్రభుత్వం కోట్లాది పనిదినాలు వేతనదారులకు కల్పిస్తోంది. ఏడాదికి 2 కోట్ల నుంచి 3 కోట్ల వరకు పనిదినాలు కల్పిస్తున్నారు. ఇందుకోసం రూ.500 నుంచి రూ.700 కోట్ల వరకు వేతనదారులకు ఏటా చెల్లిస్తున్నారు.

ఐదేళ్లలో 12.32 కోట్ల పనిదినాలు

2019 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 12.32 కోట్ల పనిదినాలు ప్రభుత్వం కల్పించింది. పనికి వచ్చిన వేతనదారులకు ఇప్పటి వరకు రూ.2732.13 కోట్లు వెచ్చించింది. మెటీరియల్ పనులకు సంబంధించి రూ.816.48 కోట్లు ఖర్చు చేసింది.

వేతనదారులకు గిట్టుబాటు వేతనం

ఉపాధి హామీ పథకంలో భాగంగా పనికి వచ్చే ప్రతి వేతనదారుడికి ప్రభుత్వం కనీస వేతనం వచ్చే విధంగా చర్యలు చేపట్టింది. గరిష్ట వేతనం రూ.272 కాగా వేతనదారులకు రూ.240 నుంచి రూ.272 వరకు వేతనం వచ్చే విధంగా చర్యలు తీసుకుంది. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి వేతనం రూ.300కు ప్రభుత్వం పెంచింది. వేతనాలు కూడా వారం రోజుల్లో జరుగుతుండడంతో వేతనదారులు ఉత్సాహంగా పనులకు వెళ్తున్నారు.

రూ.25వేల వరకు లబ్ధి



నాది గంట్యాడ మండలం పెదవేమలి గ్రామం. ప్రతి ఏటా ఉపాధి పనికి వెళ్తున్నాను. ఈ ఏడాది నాకు రూ. 25 వేలు వరకు లబ్ధి చేకూరింది. మా గ్రామంలోనే పని పెట్టడం వల్ల పనికి వెళ్తున్నాను. వేతనదారులకు పని కల్పించడంలో ప్రభుత్వం శ్రద్ధ చూపడం ఆనందంగా ఉంది. నాతో పాటు వందలాది మంది మా గ్రామంలో పనికి వస్తున్నారు.

– గాదల కృష్ణమ్మ, వేతనదారు, పెదవేమలి గ్రామం

వలసలు తగ్గాయి



నాది చీపురుపల్లి మండలం. ఉపాధి హామీ పథకం రాకముందు చాలా మంది హైదరాబాద్ విశాఖపట్నంకు పని కోసం వెళ్లేవారు. ఉపాధి పథకం వచ్చిన తర్వాత మా గ్రామంలోనే పని దొరుకుతుంది. డబ్బులు కూడా ప్రభుత్వం పని చేసిన వెంటనే జమ చేస్తుంది. దీంతో డబ్బులకు ఇబ్బంది లేదు. కుటుంబం అంతా సాఫీగా జీవనం సాగిస్తున్నాం.

– బనాన లక్ష్మి, వేతనదారు, చీపురుపల్లి మండలం